

చికెన్ ధరలు	
లైవ్	125
డ్రెస్	180
స్కిన్‌లెస్	210
గుడ్డు డజన్	72
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	35.0
కనిష్ఠం	24.0

అనుమానమే కాపాడింది

- హత్యచేసేందుకు వచ్చిన ఐదుగురు
- భూతగాదాలే కారణం
- నిందితులను పోలీసులకు పట్టించిన బాధితుడు

7



కాంగ్రెస్ పార్టీలో ప్రతిష్ఠాత్మకంగా భావించే డీసీసీ అధ్యక్ష పదవులకు గట్టిపోటీ కొనసాగుతోంది. రానున్న రోజుల్లో పార్టీ కేంద్రంగానే నిర్ణయాలు ఉంటాయని, ఎమ్మెల్యే అభ్యర్థులను సైతం డీసీసీల ద్వారానే ఎంపిక చేస్తామని పేర్కొనడంతో పాటు, పార్టీకి మొదటి నుంచి విధేయతగా ఉంటూ సేవలు అందిస్తున్న నాయకులకే పార్టీ పదవులిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



డీసీసీ అధ్యక్ష పదవులపై నజర్

- పోస్టు కోసం కీలక నాయకుల ప్రయత్నాలు
- నల్లగొండ డీసీసీకి గట్టిపోటీ
- పదవి కోసం మరోసారి గళం విప్పిన గుమ్మల
- సూర్యాపేట, యాదాద్రి డీసీసీలపై పలువురి గురి
- మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా పైరవీ

దీంతో ఈ పదవులను దక్కించుకునేందుకు సీనియర్లు, కీలక నేతలు పోటీపడుతున్నారు. అధిష్ఠానం, గాడ్‌ఫాదర్ల మెప్పు పొందడం ద్వారా పదవులు దక్కించుకునే ప్రయత్నాలు వేగవంతం చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా ఆవిర్భవించిన నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు తీవ్రపోటీ ఉంది. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల డీసీసీ అధ్యక్ష పదవుల కోసం కీలక నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. కలిసొచ్చే సామాజిక సమీకరణాలు, పార్టీకి అందించిన సేవలను వివరిస్తున్న ఆశావహులు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల ద్వారావారి ప్రయత్నాలను ఉధృతం చేశారు.

నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవికి గట్టిపోటీ

కీలకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి కోసం పలువురు నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుమ్మల మోహన్‌రెడ్డి, కొండేటి మల్లయ్యతో పాటు, పీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత ఈ పదవిని బలంగా ఆశిస్తున్నారు. శనివారం జరిగిన నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, పార్టీ పరిశీలకుడు నసిర్‌అహ్మద్ సమక్షంలోనే గుమ్మల మోహన్‌రెడ్డి తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇప్పించాలని, తాను నల్లగొండ ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, నల్లగొండ జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశానని, డీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. పదవి ఇవ్వకపోయినా పార్టీ కార్యకర్తగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శిష్యుడిగా పార్టీకి సేవలందిస్తానని పేర్కొనడం చర్చకు దారితీసింది. కీలకమైన జిల్లా కావడం, బలమైన నాయకులు పదవి ఆశిస్తుండడంతో ఈ జిల్లా డీసీసీ బాధ్యతలు అధిష్ఠానం ఎవరికి

మిగతా 6వ పేజీలో...

సూర్యాపేట డీసీసీపై కీలక నేతల గురి

సూర్యాపేట డీసీసీ అధ్యక్ష పదవిని మరోసారి తనకే కేటాయించాలని ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఆయనతో పాటు ఈ పదవికి తుంగతుర్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, పీసీసీ డెలిగేట్ అన్నెపర్తి జ్ఞానసుందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందాచార్యులు, చింతమళ్ల రమేష్ పోటీపడుతున్నారు. వీరితో పాటు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు తదితర నాయకుల పేర్లు సైతం అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు క్యాడర్‌లో చర్చ సాగుతోంది. చెవిటి వెంకన్నయాదవ్‌ను మరో పర్యాయం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిస్తారా? లేక కొత్తవారికి అవకాశం కల్పిస్తారా? అనే అంశం తేలాల్సి ఉంది.



ప్రభుత్వం రూ.2లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి ఏడు మాసాలైంది. అయితే తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో రుణాలు పొందిన రైతులకు మాత్రం వారి ఖాతాల్లో నేటికీ రుణమాఫీ నిధులు జమ కాలేదు. రాష్ట్రంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు (ఏపీజీవీబీ)లను ఈ ఏడాది జనవరి 1న తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో విలీనం చేశారు. దీంతో ఏపీజీవీబీలన్నీ టీజీబీలుగా మారాయి. ఈ క్రమంలో టీజీబీ ఇండియన్ ఫైనాన్సియల్ సిస్టమ్ కోడ్ (ఐఎఫ్ఎస్‌సీ) మారడంతో ఈ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ నిధులు ఖాతాల్లో జమకాకుండా నిలిచాయి.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

కోడ్ తెచ్చిన తంటా నిలిచిన రుణమాఫీ

- మారిన టీజీబీ ఐఎఫ్ఎస్‌సీ కోడ్
- ఏడు మాసాలు గడిచినా అందని డబ్బు

రాష్ట్రప్రభుత్వం తొలుతరూ.లక్ష, రెండో విడత రూ.1.50లక్షలు, మూడోవిడత రూ.2లక్షల లోపు రుణమాఫీ చేసింది.రేషన్ కార్డులు లేని వారికి, పేర్లు,ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబర్లు తప్పు పడిన వారికి రుణమాఫీ కాలేదు. వారు ఆందోళన వ్యక్తం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ ఏర్పాటు చేయగా, వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ కాని రైతుల వివరాలు తీసుకుని, వారితో కలిసి ఫొటోలు దిగి 2024 నవంబరులో యాప్‌లో అప్‌లోడ్ చేశారు. తప్పులు సవరించారు. ఈ తతంగం ముగిశాక 2024 నవంబరు 29న రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణమాఫీని విడుదల చేసింది.

ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడంతో..

తెలంగాణలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖలు 2025 జనవరి 1న తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో విలీనమయ్యాయి. దీంతో తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారింది. 2024 నవంబరు 29న రుణమాఫీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయకుండా, గత జనవరిలో విడుదల చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అప్పటికే టీజీబీ బ్రాంచ్‌ల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారిపోవడంతో ఆ బ్యాంకుల్లోని రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదు. కోడ్ మారిన కారణంగా రైతుల ఖాతాల్లో జమ కాని రుణమాఫీ నిధులు ప్రభుత్వానికి వాపసు వెళ్లాయి. ఇది రాష్ట్రవ్యాప్త సమస్య అయినందున రైతుల ఖాతాల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మార్చి వారి ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమచేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో రుణ

మిగతా 6వ పేజీలో...

డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు

టీజీబీల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారిన కారణంగా రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన డైరెక్టర్‌తో మాట్లాడారు. టీజీ బీ రైతుల ఖాతాల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సవరించి, రుణమాఫీ నిధులు జమ చేయాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం త్వరలోనే నిధులు విడుదల చేసే అవకాశం ఉంది.

- గోపాల్,జిల్లా వ్యవసాయశాధికారి,యాదాద్రి

బ్యాంక్ చుట్టు తిరుగుతున్న



ఆగామోత్కూర్ ఏపీజీవీబీ బ్యాంక్‌లో రూ.60వేలు పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పడంతో బ్యాంక్‌కు వెళ్లి చూడగా నగదు జమకాలేదని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి.

- కడారి వెంకన్న, కల్వలపాలెం, మాడ్గులపల్లి

వడ్డీ వ్యాపారులతో జాగ్రత్తగా ఉండాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులను, అమాయకులను లక్ష్యంగా చేసుకొని కొందరు షేర్ మార్కెట్, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులంటూ, అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి డబ్బు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఎవరైనా మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంత మంది వారి మాయలోపడి భూములు, బంగారం తాకట్టుపెట్టి డబ్బులు తీసుకొచ్చి మరీ ఆశకుపోయి పెట్టుబడులుపెట్టి మోసానికి గురవుతున్నారన్నారు. అలాగే ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. వడ్డీ వ్యాపారులు భూములను సేల్‌డీడ్లు చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.సైబర్ నేరాలపై ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు.

పేదలకు వైద్య సేవలందించడం అభినందనీయం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



వైద్యులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరంగా ఎన్నో ఒత్తిళ్లు ఉన్నా వైద్య వృత్తిలో ఉంటూ పేద ప్రజలకు సేవలందించడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవల అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించిన డాక్టర్ల బృందాన్ని కలెక్టర్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు దీటుగా జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యుల బృందం మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతం చేసిందని, 60 ఏళ్ల వయసు ఉన్న మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించి ఆరు కిలోల కణతిని తొలగించారని అభినందించారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రులను పటిష్టం చేస్తోందన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్ సహాయ డైరెక్టర్ నగేష్ మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ ఫ్యాకల్టీతో పాటు, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. అనంతరం వైద్యులు శ్రీకాంత్, నిఖిత, దివ్య, బద్రి నారాయణ, పరమేశ్వరి, సుధ, గిరిని శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. అంతకుముందు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో నిర్వహించిన మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు, అకాడమిక్ సౌకర్యాలు, భవనాలు, లెక్చర్ హాల్స్ లైబ్రరీ, విద్యార్థుల హాస్టల్ తదితర విషయాలపై సమీక్షించారు. అనంతరం నూతనంగా నిర్మించిన మ్యూజియం, ఇండోర్ గేమ్స్ హాల్, డిసెక్షన్ హాల్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఆ తర్వాత మెడికల్ కళాశాల పక్కనే ఉన్న స్థలంలో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వినీల రాణి, రామచంద్ర, అజీజ్, వందన, స్వరూప రాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైనేజీలు పటిష్టంగా ఉండాలి

జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు



తిప్పలమ్మగూడెంలో ఇంకుడుగుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

తిప్పర్తి,జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టంగా ఉండాలని జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం తిప్పర్తి మండల పరిధిలోని తిప్పలమ్మగూడెం, సర్వారం గ్రామాల్లో కమ్యూనిటీ డ్రైనేజీలను నిర్మించడానికి తగిన స్థలాలను ఆయన పరిశీలించారు.గ్రామాలకు శివారులో పంటపొలాలు ఉండడంతో డ్రైనేజీ నీరంతా ఒకే స్థలంలో చేరేలా ఇంకుడు గుంత నిర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్సీ శంకర్ నాయక్
- కాంగ్రెస్‌లో ఒక్కరికి ఒకే పదవి : టీపీసీసీ పరిశీలకుడు నసీర్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఒక్కరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలను దండుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల మాటలు ఎవ్వరూ నమ్మడం లేదని, ప్రజల విశ్వాసం కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ మతతత్వం పేరుతో రాజకీయం చేస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ పరిశీలకుడు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు లభిస్తాయన్నారు. బ్లాక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం కోసం దరఖాస్తులు తీసుకొని సామాజికన్యాయం పాటించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో మండలం నుంచి మూడు దరఖాస్తులు తీసుకొని స్థానిక నాయకుల సమన్వయంతో ఎంపిక చేస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, మంత్రి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ, నియోజకవర్గ నుంచి ఇప్పటివరకు ఎవ్వరికీ రాష్ట్రస్థాయి పదవులు రాలేదని, గుమ్మల మోహన్‌రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు లేదా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలన్నారు. ఈ మేరకు తీర్మానం చేయగా, సమావేశానికి వచ్చిన పార్టీ శ్రేణులంతా మద్దతు ప్రకటించారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, గడ్డం అనుపరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, బషీర్ అహ్మద్, సంకు ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో యాదాద్రి సేవలు

- అందుబాటులో ఆర్జిత, దర్శన సేవలు
- అద్దె గదులు,శాశ్వత పూజలు, విరాళాలకు సైతం ఆన్‌లైన్‌లో అవకాశం

6

రైతులకు అవగాహన కల్పించేందుకే 'సాగు న్యాయ యాత్ర'

- అక్టోబరు 2 వరకు 800 గ్రామాల్లో 2,400 కిలోమీటర్ల యాత్ర
- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

బదిలీపై జిల్లాకు ఇద్దరు డీఎస్పీలు

నల్లగొండ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా జిల్లాకు కొత్తగా ఇద్దరు డీఎస్పీలు నియమితులయ్యారు. ఎస్బీ డీఎస్పీగా ఇప్పటి వరకు వెయిటింగ్‌లో ఉన్నా భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీగా వెయిటింగ్ లిస్టులో ఉన్న జి.రవిని నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఈ రెండు పోస్టులు కొంతకాలంగా ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు.

భవిత పనులను త్వరగా పూర్తిచేయాలి

డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు



మండల కేంద్రంలో భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

మాడ్గులపల్లి,జూన్28 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను త్వరగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో నిర్మితమవుతున్న భవిత కేంద్రం పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు భవిత కేంద్రంలో ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

యూనియన్ల సమావేశాన్ని విజయవంతం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లేష్



సమావేశంలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి జూలై 1న నిర్వహించనున్న అన్ని కార్మిక యూనియన్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలం, పట్టణం, వేములపల్లి, మాడ్గులపల్లి మండలాలకు సంబంధించి అన్ని రంగాల్లో పనిచేస్తున్న యూనియన్ల సభ్యులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మల్లుగౌతంరెడ్డి, హమాలీల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు ముత్యాల లక్ష్మీనారాయణ, మాలి చిన్నరాములు, తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో యాదాద్రి సేవలు

- లక్ష్మీనరసింహుల ఆన్‌లైన్ సేవలు
- అద్దె గదులు,శాశ్వత పూజలు, విరాళాలు
- అందుబాటులో ఆర్జిత, దర్శన సేవలు

యాదగిరిగుట్ట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి భక్తులకు దేవాదాయ శాఖ అనుమతితో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. శివకేశవుల క్షేత్రంగా విరాజిల్లుతోన్న ఉభయ ఆలయంలో నిత్య పూజలు, శాశ్వత పూజలు, అద్దె గదులు, వాహన పూజలు, విరాళాల సేకరణకు ఆన్‌లైన్ సేవలు భక్తులు కూడా ఆదరిస్తున్నారు. 2019 జూలై మాసంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం కాగా కొవిడ్-19 కాలంలో ఆన్‌లైన్ పూజలు నిర్వహించారు. 2023 నవంబరు 1 నుంచి 200 మంది భక్తులకు పరిమితి విధించి ఆన్‌లైన్ బ్రేక్‌దర్శనం టికెట్లు అందుబాటులోకి రాగా ఇప్పుడు ఆ పరిమితిని ఎత్తివేశారు. మరింత మెరుగైన సేవలు భక్తులకు అందించేందుకు దేవాదాయ శాఖ, యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులు పాత ఆచారాల పునరుద్ధరణకు సంయుక్తంగా కృషి చేస్తున్నారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులకు టికెట్ల కోసం పోటీ పడకుండా ఉండేందుకు ఆర్జిత సేవలే కాక దర్శన సేవలు కూడా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. 2025 వేసవి కాలంలో అధికారుల గణాంకాల మేరకు లక్ష వరకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో వెబ్‌సైట్ నుంచి అన్ని రకాల టికెట్లు పొందే అవకాశం భక్తుల ముందుంచినట్లు అధికారులు తెలిపారు. పూజలకు నిర్ణయించిన సమయం కంటే అర్ధగంట ముందుగానే ఆలయం వద్దకు భక్తులు చేరుకోవాల్సి ఉంటుంది. కాగా, వీవీఐపీ, వీఐపీ, ప్రజాప్రతినిధులు, వీరి ద్వారా అందే సిఫారసులకు సంబంధించిన భక్తులు రూ.300 టికెట్టుతో బ్రేక్ దర్శనం, రూ.150 టికెట్టుతో శీఘ్రదర్శనం చేసుకునే అవకాశం కల్పించారు. దేశ, విదేశాలకు చెందిన శాశ్వత పూజలు జరిపించేందుకు కూడా భక్తులు ఆన్‌లైన్ ఆవకాశం కల్పించారు.

బ్రేక్ దర్శనం టికెట్లు అధికం

ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా 2025 జనవరి 10 నుంచి జూన్ 30వరకు బ్రేక్ దర్శనం 10,053, ప్రత్యేక (రూ. 150) దర్శనం 2,818, నిత్య కల్యాణం 1,401, సుప్రభాత దర్శనం 1,277, సత్యదేవుని వ్రతాలు 898 మాత్రమే ఆన్‌లైన్ టికెట్ల కోసం భక్తులు నమోదు చేసుకున్నారు. 2019 సంవత్సరంలో ప్రారంభించిన వెబ్‌సైట్‌ను మార్చి ఈ ఏడాది జనవరి నుంచి కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆన్‌లైన్‌లో టికెట్లు పొందిన భక్తులు కొండపైకి చేరుకోగా వారి టికెట్ల ప్రింట్ సమస్య ఎదురవుతోంది. తిరిగి భక్తులు కొండ కిందకు వెళ్లి ప్రింట్ తేవాల్సి వస్తోంది. ప్రింటింగ్ సౌకర్యం కూడా కొండపైనే కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో

ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకున్న భక్తులు కొండపైన శివాలయాన్ని దర్శించుకుంటారు. శివకేశవుల క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన క్షేత్రంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో కూడా 10రకాల ఆన్‌లైన్ సేవలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ జరిగే పూజలు సమయానికి భక్తులు చేరుకోవాలని అధికారులు కోరారు.

పలు రకాల టికెట్లు

ఈ క్షేత్రంలో స్వామిఅమ్మవార్లకు సంబంధించిన సేవలు 15 రకాలు, శివాలయంలో 11 రకాలు, సత్యదేవుని వ్రత పూజలు, వాహన పూజలు 4 రకాలు, శాశ్వత పూజలు 11 రకాలు, లక్ష్మీ, ఆండాళ్ సదనం పేరుతో ఉన్న భవనాల్లో ఒక్కో గదికి రూ.1008, రూ. 560, రూ.700 అద్దెతో గదులు అం దుబాటులో ఉండగా విరాళాలకు సంబంధించి 5 రకాల సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. స్వామి అమ్మవారల సేవల కోసం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న భక్తులు పూజ సమయానికి అర్ధగంట ముందుగానే ప్రధానాలయానికి చేరుకోవాలి.

సత్యనారాయణ వ్రతానికి ఏర్పాట్లు

రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన ఇక్కడి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంది. కాగా, ఇక్కడ విశాలమైన రెండు హాళ్లల్లో ఉదయం 7.30 గంటలకు మొదటి విడత, 10 గంటలకు రెండో విడత, మధ్యాహ్నం 12 గంటలకు మూడో విడత, సాయంత్రం 4 గంటలకు నాలుగో విడతల వారీగా రూ.800లతో దంపతులు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

ఆలయంలో వాహన పూజలు

స్వయంభువులను దర్శించుకునేందుకు తరలివస్తున్న భక్తులు ఇక్కడ వాహన పూజలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ పునర్నిర్మాణ సమయంలో కొండకు దక్షిణ దిక్కులో చెక్‌పోస్టు సమీపం, మొదటి ఘాట్, పాత గోశాల వద్ద పూజలు జరిగాయి. పునర్నిర్మాణంలో భాగంగా ప్రత్యేకంగా కొండకింద ఆధ్యాత్మిక వాడను రూపొందించారు. కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో సత్యదేవుని వ్రత మండపం పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసినా అసౌకర్యంగా ఉందని గుర్తించిన అధికారులు ఇప్పుడు కొండకు ఈశాన్య దిక్కులో హెలిప్యాడ్ వద్ద ఆలయ పునరుద్ఘాటన సమయంలో నిర్మించిన కుటీరాన్ని కేటాయించారు. కానీ, క్షేత్ర సందర్శనకు చాపర్‌లో వచ్చిన ప్రముఖులు తిరిగి వెళ్లే వరకు వాహన పూజలు నిలిపివేస్తుండటంతో గంటల తరబడి భక్తులు ఎదురుచూస్తున్నారు. త్వరగా వాహన పూజల కోసం స్థలాన్ని గుర్తించి ప్రత్యేకంగా భవన నిర్మాణం చేసి భక్తులు అసౌకర్యానికి నిర్మూలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

క్ర.సం.	వాహన రకం	టికెట్టు ధర
1.	ద్విచక్ర వాహనం	రూ. 300
2.	ఆటో	రూ. 400
3.	కారు	రూ. 600
4.	బస్సు/లారీ/ట్రాక్టర్	రూ. 1,000

దేశ, విదేశాలకు చెందిన శాశ్వత పూజలు జరిపించేందుకు కూడా భక్తులు ఆన్‌లైన్ ఆవకాశం కల్పించారు.

కొండకింద తులసీ కాటేజీలో ఆన్‌లైన్‌లో అద్దె గదులు

కాటేజీ పేరు	ధర
1. లక్ష్మీ సదనం-1 (తులసీ కాటేజీ)	రూ. 1,008
2. ఆండాళ్ సదనం-2	రూ. 1,008
3. లక్ష్మీ సదనం-2 (తులసీ కాటేజీలో)	రూ. 560
4. ఆండాళ్ సదనం-1	రూ. 700

క్ర. సం	స్వామివారి సేవ	టికెటు ధర
1.	సుప్రభాత దర్శనం	రూ.100ఒక్కరు
2.	నిజాభిషేకం	రూ.800దంపతులు (రూ.400ఒక్కరు)
3.	శతఘటాభిషేకం (స్వాతి నక్షత్ర రోజున)	రూ.500ఒక్కరు
4.	సహస్రనామార్చన	రూ. 300
5.	సుదర్శన నారసింహ హోమం	రూ.1,250ఇద్దరు
6	నిత్య కల్యాణం	రూ.1,500
7.	అన్నప్రాసన	రూ.1,000
8.	లక్ష పుష్పార్చన (ప్రతి ఏకాదశి రోజున)	రూ.2,500
9.	వేద ఆశీర్వచనం	రూ.600
10.	జోడు సేవలు	రూ.700
11.	సువర్ణ పుష్పార్చన	రూ.600
12.	ఊంజల్ సేవ (ప్రతి శుక్రవారం)	రూ.1,000
13.	దర్బారు సేవ	రూ.516
14.	తిరు కల్యాణోత్సవం	రూ.3,000
15.	శయనోత్సవం	రూ.100ఒక్కరు

రైతు భరోసాతో చరిత్ర సృష్టించిన ప్రభుత్వం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రైతుభరోసాను రైతుల ఖాతాలో జమ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసాను అందజేసిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సాగులో ఎంత భూమి ఉంటే అంత మేరకు రైతులకు పెట్టుబడి అందజేయడంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వ్యవసాయం పండుగలా మారిందని అన్నారు. రైతుల కోసం చేపడుతున్న పథకాలే రైతుల సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందనడానికి నిదర్శనమన్నారు. రుణమాఫీ కింద లక్షలాది మంది రైతులకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 22 వేల కోట్లను మాఫీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతుభరోసా రైతుల ఖాతాలో జమ చేయడంతో వ్యవసాయ పెట్టుబడులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసి ందని దానిప్రకారం సబ్సిడీపై పథకాలను అందించాలని మంత్రిని కోరారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకొని రాష్ట్రంలో రెండో స్థానానికి చేరిందని మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతుల సంక్షేమం కోసం రాబో యే రోజుల్లో మరిన్ని పథకాలు చేపడుతామని, సహకారరంగం బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు.

భువనగిరి వాసికి భారత కళారత్న అవార్డు



భారత కళారత్న అవార్డు అందుకుంటున్న రావుల నాగరాజు

భువనగిరిరూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌కు చెందిన అయ్యప్ప మహాశాస్త్ర సేవా సంఘం జిల్లా ఇన్‌చార్జి, మండల, పట్టణ ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు రావుల నాగరాజు భారత కళారత్న అవార్డు అందుకున్నారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఓసూరులో నిర్వహించిన కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి ఇందేషగిరి అవార్డు ఉత్తమ ఛాయాచిత్ర ఫొటోగ్రాఫర్ అవార్డును అందజేశారు. అకాడమీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నాగరాజును వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర



భువనగిరి జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

భువనగిరి టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ వరకు భక్తుల భజనలు, కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహంగా సాగింది. అందంగా అలంకరించిన శకటంలో ప్రతిష్ఠించి ఊరేగించిన జగన్నాథ స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించి పూజలు చేశారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఇస్కాన్ భువనగిరి అధ్యక్షులు సిద్దేష్ కుమార్ బోగారపు ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రకు పలువురు ప్రముఖులు స్వాగతం పలికి పూజలు చేశారు.

రైతులకు అవగాహన కల్పించేందుకే 'సాగు న్యాయ యాత్ర'

- అక్టోబరు 2 వరకు 800 గ్రామాల్లో 2,400 కిలోమీటర్ల యాత్ర
- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాగు న్యాయ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోదండరెడ్డి నాయకులు తదితరులు

భూదాన్‌పోచంపల్లి, మునుగోడు, చౌటుప్పల్ టౌన్ జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతన్నల సాగుకు న్యాయం చేకూర్చేందుకు 'సాగు న్యాయ యాత్ర' నిర్వహిస్తున్నట్లు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వినోబామందిరం నుం చి లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఆధ్వర్యంలో శనివారం భూమి సునీల్ సారథ్యంలో 'సాగు న్యాయ యాత్ర'ను ఆయన ప్రారంభించారు. భూదానోద్యమానికి నాంది పలికిన భూదాన్‌పోచంపల్లిలోని భూదాత వెదిరె రామచంద్రారెడ్డి, భూదానోద్యమ పిత ఆచార్య వినోబా భావే విగ్రహాలకు ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భూదానోద్యమానికి అంకురార్పణ జరిగిన జువ్విచెట్టు కింద కరపత్రాలు, పోస్టర్లను ఆయన ఆవిష్కరించి ప్రారంభించిన సాగు న్యాయయాత్రను భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, మునుగోడులో నిర్వహించారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూభారతి చట్టం

ఆయా కార్యక్రమాల్లో కోదండరెడ్డి, భూచట్టాల నిపుణుడు, రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్ మాట్లాడుతూ రైతులకు భూమి, వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించటం కోసమే సాగు న్యాయయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేస్తోందని, ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ధరణిలో జరిగిన అనేక అవకతవకలను సరిచేసేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చారని అన్నారు. త్వరలో రైతుల కోసం 'విత్తన చట్టం' అమలులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. భూమి, వ్యవసాయానికి సంబంధించిన చట్టాలు ఎన్నో ఉన్నా వాటిపై రైతులకు అవగాహన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య బాధిత రైతులకు ఎంతగానో ఇబ్బంది కలిగిస్తోందని తెలిపారు. రైతులు సమస్యల నుంచి విముక్తి కోసం సాగు న్యాయ యాత్ర పేరుతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రైతుకు చట్టం చుట్టం కావాలన్నారు. ఎంతో చరిత్ర కలిగిన భూదాన్‌పోచంపల్లి నుంచి సాగు న్యాయ యాత్ర ప్రారంభం కావడం హర్షదాయకమని పేర్కొన్నారు. నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో 800 గ్రామాల్లో సుమారు 2,400 కిలోమీటర్ల వరకు యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. సుమారు పది వేల మంది రైతులను స్వయంగా కలిసి వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పిస్తామని ఆయన వివరించారు. పోచంపల్లి నుంచి ప్రారంభించిన సాగు న్యాయ యాత్ర ఫలప్రదం కావాలని అభిలషిస్తూ అక్కడికి వచ్చిన జలాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు గోరంటి శ్రీనివాస్‌రెడ్డి రూ.50వేలు అందజేశారు. ఈ యాత్ర అన్నదాతల కోసం సాగుతున్నందున తనకు ఎంతో సంతోషంగా ఉందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మునుగోడుకు వచ్చిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని రైతులు కలిసి రైతు వేదికలో వసతులు లేక పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోతున్నామని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కోదండరెడ్డి వ్యవసాయ రంగ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. రైతులకు రుణ విముక్తి కల్పించిన ఘనత రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, లీఫ్స్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్, ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ అభిలాష్, కోశాధికారి మల్లేష్, సభ్యులు ప్రవీణ్, రవి, కాంగ్రెస్ పోచంపల్లి మండల అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు. మునుగోడు ఏడీఏ వేణుగోపాల్, తహసీల్దార్ నరేష్, ఎంపీవోలు పద్మజ, మల్లేష్, చౌటుప్పల్ ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఏడీఏ వెంకటేశ్వరరావు, ఏఎంసీ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, ఏవో ఎం.నాగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘూమారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్, చప్పిడి సంజీవరెడ్డి, చంద్రకళ, చెన్నగోని అంజయ్య, బి.మల్లేశం, కొండూరు వెంకన్న పాల్గొన్నారు.

ఇస్రోలో 'తేజ' విద్యార్థులకు శిక్షణ



ఇస్రోలో శిక్షణ పొందిన తేజ విద్యాలయం విద్యార్థులు

కోదాడ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమరబండ తేజ విద్యాలయంలో 10వ తరగతి పూర్తిచేసిన విద్యార్థినులు ఇద్దరు డెహ్రాడూన్‌లోని భారతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్‌లో జూన్ 23 నుండి 27 వరకు నిర్వహించిన శిక్షణకు ఎంపికయ్యారు. ఈ శిక్షణకు దేశవ్యాప్తంగా వంద మంది విద్యార్థులకు అవకాశం కల్పించగా, తెలంగాణ రాష్ట్రం నుంచి తేజ విద్యాలయంలో ఈ సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సమజ్ఞ, శ్రీవల్లిలు మాత్రమే పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి శనివారం విలేకరులకు తెలిపారు. విద్యార్థిని శ్రీవల్లి మాట్లాడుతూ ఇస్రోలో శిక్షణ పొందడం జీవితకాలం మర్చిపోలేని జ్ఞాపకమని పేర్కొంది. సమజ్ఞ తాను భవిష్యత్తులో ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. విద్యార్థులను డైరెక్టర్ సోమిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి టౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసులు శ్రద్ధ చూపాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి జయరాజు అన్నారు. భువనగిరిలోని జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసు నమోదు, చార్జిషీట్ దాఖల సమయంలోనే నిందితులకు శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా సాక్ష్యాధారాలను పొందుపరచాలని సూచించారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లలోతప్పించుకునితిరుగుతున్న నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశించారు. కోర్టులలో పెండింగ్ కేసులు తగ్గేందుకు రాజీ పడ దగు కేసులను గుర్తించి కక్షిదారులు జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. దీంతో కోర్టులపై భారం తగ్గి తీవ్ర నేరాల కేసులపై దృష్టి పెట్టేందుకు సమయం లభిస్తుందన్నారు. సమాజంలో సామరస్యాన్ని పెంపొందించేందుకు కోర్టులు, తమ వంతు పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం సబ్‌జైలును సందర్శించి ఖైదీలతో ముఖాముఖి నిర్వహించి నేర స్వభావాన్ని వీడనాడాలని , ఉచిత న్యాయ సాయం కావాల్సిన ముద్దాయిలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ముక్తిదా, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉష శ్రీ, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్, యాదగిరిగుట్ట ఏసీపీల మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ నాయుడు, సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం నెహ్రూ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవులపై నజర్

(5వ పేజీ తరువాయి)

అప్పగిస్తుందనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.

యాదాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎవరికో?

యాదాద్రి జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిని ప్రస్తుతం గుండాల మండలానికి చెందిన అండెం సంజీవరెడ్డి నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీని వీడిన సమయంలో యాదాద్రి డీసీసీ అధ్యక్షుడిగా సంజీవరెడ్డిని నియమించారు. అనిల్‌కుమార్‌రెడ్డి తిరిగి పార్టీలోకి వచ్చినా, భువనగిరి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలవడంతో సంజీవరెడ్డినే అధ్యక్షుడిగా కొనసాగిస్తూ వచ్చారు. తక్కువ కాలమే పనిచేసిన నేపథ్యంలో ఆయన్నే మళ్లీ డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలనే ప్రతిపాదనలు ఉండగా, మరోవైపు ఈ పదవి ఆశిస్తున్న నాయకులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పదవి ఎవరిని వరిస్తుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఆలేరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కుడుదుల నగేశ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలనే ప్రతిపాదనలు హైకమాండ్ దృష్టికి వెళ్లినట్లు క్యాడర్‌లో చర్చసాగుతోంది. భువనగిరి నియోజకవర్గానికి చెందిన పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, సీనియర్ నేత తంగెళ్లపల్లి రవికుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లెంల సంజీవరెడ్డి సైతం డీసీసీ అధ్యక్ష పదవికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా ఈ నేతలు డీసీసీ పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

వైకుంఠద్వారం వద్ద పోలీసుల వాహన తనిఖీ



వాహనం తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట దివ్యక్షేత్రానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు శనివారం వైకుంఠద్వారం చెంత తనిఖీలు చేపట్టారు. తిరుపతి తరహాలో పుణ్యక్షేత్రానికి స్థానిక పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. సింహద్వారం ప్రధాన కూడలి వద్ద సాయంత్రం కార్లు, ద్విచక్ర వాహనాలను అకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపారు. సాధారణంగా తనిఖీల్లో భాగంగా పోలీసు బృందంతో సుమారు 15 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు, 10 కార్లను తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు.

కోడ్ తెచ్చిన తంటా.. నిలిచిన రుణమాఫీ

(5వ పేజీ తరువాయి)

మాఫీ నిధులు అందుతాయా? లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సుమారు 15,000 మంది రైతులకు అందని రుణమాఫీ

మోత్కూరు మండలంలో 144 మంది టీజీబీ రైతులకు రూ.1.48లక్షల రుణమాఫీ అందలేదు. యాదాద్రి జిల్లాలో టీజీబీల్లో రుణాలు తీసుకున్న రైతులు సుమారు 3వేల మందికి రూ.28కోట్లు వారి ఖాతాల్లో జమ కాలేదని తెలుస్తోంది. నల్లగొండ జిల్లాలో సుమారు 4 వేల మంది రైతులకు, సూర్యాపేట జిల్లాలో సుమారు 3,500 మంది రైతులకు రుణమాఫీ అందలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టీజీబీల్లో రుణమాఫీ నిధులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

బ్యాంక్ చుట్టూ తిరుగుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలంలోని 28 పంచాయతీలు ఉండగా, ఆగామోత్కూర్, మాడ్గులపల్లి, కన్నెకల్ గ్రామాల్లో టీజీ బ్యాంక్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ఇప్పటివరకు సుమారు 3,200మంది రైతులకు రుణమాఫీ నగదు ప్రభుత్వం నుంచి జమైంది. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడంతో మండలంలోని సుమారు 100మంది రైతుల రుణమాఫీ నగదు వెనక్కివెళ్లింది.

రుణమాఫీ డబ్బు జమకాలేదు



నాకు అనాజిపురంలో వ్యవసాయ భూమి ఉంది. పెట్టుబడి కోసం మోత్కూరు ఏపీజీవీబీలో రుణం తీసుకున్నా. అది ఇప్పుడు టీజీబీగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నాకు రూ. 1,02,408 రుణంమాఫీ చేసింది. సుమారు ఏడు మాసాలు గడుస్తున్నా నా ఖాతాలో ఆ నిధులు జమ కాలేదు. మాఫీ ప్రకటించిన ప్రభుత్వం నిధులు వెంటనే జమ చేయాలి.

లోకసాని దివ్య, మహిళా రైతు, అనాజిపురం

మునిసిపాలిటీల అభివృద్ధే లక్ష్యం

మునుగోడు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చండూరు, చౌటుప్పల్ మునిసిపాలిటీ ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం చండూరు, చౌటుప్పల్ మునిసిపాలిటీలపై సంబంధిత అధికారులు, అక్కడి నాయకులతో వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆయా మున్సిపాలిటీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానం, వాన నీటి కాలువలు, మురుగు నీటి శుద్ధి చేసే ప్లాంట్లు, పార్కుల అభివృద్ధి, సమీకృత మార్కెట్, నూతన మున్సిపాలిటీ భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్మాణాల అభివృద్ధి వంటి వాటిపై సమగ్రంగా చర్చించారు. ఈమేరకు సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభాని ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజాఆరోగ్య ఎస్ఈ వెంకటేశ్వరరావు, డీఈ మనోరమా, ఏఈ నాగప్రసాద్, విద్యుత్ ఏఈ గణేష్, ఆయా మునిసిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్ల ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్ పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్ల హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్రన్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

ఇందిరమ ఇల్లు మంజూరు చేయాలని ట్యాంక్ ఎక్కి

యువకుడి హల్‌చల్

● యాదాద్రిభువనగిరి జిల్లా వెంకటపురంలో ఘటన





వలిగొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెంకటపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు శనివారం వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటపురం గ్రామానికి చెందిన బొడ్డు మత్స్యగిరి అనే యువకుడికి ఎలాంటి వ్యవసాయ భూమిగానీ, ఆస్తిగానీ లేదు. కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి చిన్నతనంలోనే తల్లి మరణించింది. కాగా, ఐదు సంవత్సరాల క్రితం తండ్రి చంద్రయ్య మృతి చెందాడు. గ్రామస్థులందరూ చందాలు వేసుకుని అతడి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రస్తుతం మత్స్యగిరి అతని పాలివాళ్ల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అన్ని రకాలుగా అర్హుడైన మత్స్యగిరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11గంటల ప్రాంతంలో గ్రామంలోని వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. అతడికి గ్రామస్థులు సైతం మద్దతు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు తనకు ఇల్లు మంజూరు చేయలేదని మత్స్యగిరి ఆవేదన వ్యక్తంచేస్తూ వెంటనే తనకు ఇంటిని మంజూర చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుక్ను ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో మత్స్యగిరి వాటర్‌ట్యాంక్ దిగడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

డ్రైవర్, కండక్టర్ల నిజాయితీ

● ప్రయాణికురాలి బ్యాగు అప్పగింత



బ్యాగ్‌ను ప్రయాణికురాలి బంధువుకు అప్పగిస్తున్న సిబ్బంది

దేవరకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు నిజాయితీ చాటుకున్నారు. దేవరకొండ ఆర్టీసీ డిపోనుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సులో హైదరాబాద్ బొల్లారంకు చెందిన ప్రయాణికురాలు శుక్రవారం బస్సులో హ్యాండ్ బ్యాగు మర్చిపోయి దిగిపోయింది. గమనించిన కండక్టర్ అలివేలు, డ్రైవర్ నజీర్‌లు బస్సులో ప్రయాణికురాలి బ్యాగును దేవరకొండ డిపోకు తీసుకు వచ్చి అసిస్టెంట్ మేనేజర్ సైదులుకు అప్పగించారు. బ్యాగులో రూ.40వేల విలువైన మొబైల్‌ఫోన్, రూ.2వేల నగదుతోపాటు ఆధార్‌కార్డు, ఇతర పత్రాలు ఉన్నాయి. బస్సులో మర్చిపోయిన బ్యాగును ప్రయాణికురాలి బంధువుకు శనివారం అప్పగించినట్లు సైదులు తెలిపారు. డ్రైవర్, కండక్టర్లను డిపో మేనేజర్ రమేష్‌బాబు, సైదులు అభినందించారు.

అనుమానమే కాపాడింది

● హత్య చేసేందుకు వచ్చిన ఐదుగురు ● పోలీసులకు పట్టించిన బాధితుడు ● సూర్యాపేట జిల్లాలో ఘటన



కారులో హత్య చేసేందుకు వచ్చి పట్టుబడిన నిందితులు

సూర్యాపేటక్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో భూవివాదం నేపథ్యంలో ఓ వ్యక్తి అనుమానం అతడిని కాపాడింది. గుడ్డిగా నమ్మకుండా ఫోన్ చేసిన వారిని అనుమానించి పట్టుకోవడంతో హత్యోదంతానికి సంబంధించిన వివరాలు వెలుగు చూశాయి. పోలీసులకు అప్పగించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట పట్టణ ఇన్‌చార్జి సీఐ గురుకుల రాజశేఖర్, ఫిర్యాదుదారుడు పజ్జూరి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన పజ్జూరి వెంకటేశ్వర్లు సూర్యాపేటలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు సమీపంలోని మహేంద్రా ట్రాక్టర్ షోరూంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వెంకటేశ్వర్లు కుటుంబానికి సర్వే నెంబరు 156/2, 159/1/2లో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ పక్కనే ఆయన పెదనాన్న పజ్జూరి భిక్షంకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఆ భూమిని నల్లగొండకు చెందిన వంగాల కిరణ్‌గౌడ్‌కు నాలుగేళ్ల క్రితం విక్రయించగా అందులో కిరణ్‌గౌడ్ స్టోన్ క్రషర్ ఏర్పాటుచేశాడు. కొంతకాలంగా వెంకటేశ్వర్లు భూమిలో కొంతభాగాన్ని కిరణ్‌గౌడ్ ఆక్రమించి క్రషర్ దుమ్ము, రాళ్లు వేస్తున్నాడు. ఈ విషయంలో పలుమార్లు కిరణ్‌గౌడ్, వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు మధ్య ఘర్షణ జరిగింది. మోతె పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు కూడా కేసులు పెట్టుకున్నారు.

హత్యకు కుట్ర

క్రషర్ విషయంలో అడ్డుతగులుతున్నాడని వెంకటేశ్వర్లును హత్య చేయించాలని కిరణ్‌గౌడ్ భావించాడు. అందులో భాగంగా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంకు చెందిన మేడి శివప్రసాద్, బొడ్డుపల్లి స్వామి, గంగదేవి నర్సింహ, మాదగోని రమేష్, బరిగల శివాజీ, నల్లగొండ పట్టణంలోని మర్రిగూడకు చెందిన బొజ్జ చందును సంప్రదించాడు. వెంకటేశ్వర్లును హత్య చేయాలని చెప్పాడు. అందుకోసం ముందస్తుగా నిందితులకు కిరణ్‌గౌడ్ రూ.లక్ష ఇచ్చాడు. దీంతో నిందితులు టీఎస్07హెచ్ఎస్ 6126 నెంబరు గల కారును తీసుకుని ఈ నెల 26న సూర్యాపేటకు వచ్చి వెంకటేశ్వర్లుకు ఫోన్ చేశారు. తమది కాసరబాద అని తమ వద్ద 1997 సంవత్సరం మోడల్ మహేంద్ర ట్రాక్టర్ ఉందని, దాని క్లచ్‌ప్లేట్లు పోయాయని, కాసరబాద సమీపంలోని క్రషర్ వద్ద ట్రాక్టర్ ఉందని అక్కడికి వచ్చి మరమ్మతు చేయాలని కోరారు. దీంతో వెంకటేశ్వర్లు తాను ట్రాక్టర్ షోరూంలో లేనని షోరూం వద్దకు వెళ్తే మెకానిక్ ఉంటాడని అతడితో మాట్లాడి రిపేరు చేయించుకోవాలని సూచించాడు. తర్వాత ఈ నెల 27న రాత్రి 8 గంటల సమయంలో మరోసారి సంబంధిత వ్యక్తులు సూర్యాపేటలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్ద గల మహేంద్ర ట్రాక్టర్ షోరూం వద్దకు వచ్చి వెంకటేశ్వర్లుకు ఫోన్‌చేశారు. తమను కలవాలని పని ఉందని షోరూం వద్దనే ఉన్నామన్నారు. దీంతో అనుమానం వచ్చిన వెంకటేశ్వర్లు తాను షోరూంలో లేనని కాసేపట్లో వస్తానన్నాడు. అనంతరం షోరూం ఉద్యోగికి ఫోన్ చేసి షోరూం ముందు ఏదైనా కారు ఆగి ఉందా చూడాలని కోరాడు. ఆ ఉద్యోగి ఒక కారు ఉందని అందులో ఐదుగురు వ్యక్తులు ఉన్నారని, కారు నెంబరు ప్లేట్‌కు నల్లరంగు స్టిక్కర్ వేసి ఉందని, వారిపై అనుమానం ఉందని వివరించాడు. దీంతో వెంటనే వెంకటేశ్వర్లు తన మిత్రులు, సమీప బంధువులకు విషయాన్ని తెలిపి అందరితో కలిసి ట్రాక్టర్ షోరూం వద్దకు వచ్చే సరికి నిందితులు కారులో ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకున్నారు. వెంటనే కారును అడ్డగించి కారులో ఉన్న వారిని పారిపోకుండా పట్టుకుని పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును తనిఖీచేయగా అందులో మద్యం సీసాలు, కర్రలు ఉన్నాయి. వెంటనే కారుతో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు వంగాల కిరణ్‌గౌడ్, శివాజీ, స్వామి, నర్సింహ, శివప్రసాద్, రమేష్, చందులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు రాజశేఖర్ తెలిపారు. ప్రస్తుతానికి శివప్రసాద్, స్వామి, రమేష్, నర్సింహ, శివాజీలను కోర్టుకు రిమాండ్‌కు తరలించామని, మిగిలిన ప్రధాన నిందితుడు వంగాల కిరణ్‌గౌడ్‌తో పాటు బొజ్జ చందు పరారీలో ఉన్నాడని త్వరలో వారిని కూడా పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

బస్సు, బైక్ ఢీ: ఒకరి మృతి

పెద్దవూర, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రం సమీపంలోని నాయనవానికుంట స్టేజీ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నాయనవానికుంట గ్రామానికి చెందిన మేకల శంకర్(40) శనివారం మధ్యాహ్నం 12.20గంటల సమయంలో వైన్‌షాపు నుంచి తన మోటార్ సైకిల్‌పై నాగార్జునసాగర్-హైదరాబాద్ హైవేపై వెళ్తూ రోడ్డు దాటుతుండగా అదే సమయంలో మహబూబ్‌నగర్ డిపోకు చెందిన బస్సు గుంటూరు నుంచి నాగార్జునసాగర్ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్తూ ఢీకొట్టింది. ఈ ఘటనలో మేకల శంకర్ తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శంకర్‌కు భార్య, కుమారుడు శివ, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ వై.ప్రసాద్ తెలిపారు.

ఖానాపురం ప్రధానోపాధ్యాయుడిపై వేటు

అనంతగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలం ఖానాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సస్పెండ్ అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 13న ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు హాజరు రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోయారు. అదే సమయంలో తనిఖీకి వచ్చిన అధికారి, గమనించి సస్పెండ్‌చేసినట్లు సమాచారం.

గంజాయి తాగుతున్న నలుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు రూ.70వేల విలువైన 2.780 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ సందీప్ రెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన ముడావత్ అశోక్, కొత్తపల్లి నాగార్జున, నంబూరి రత్నాకర్‌రెడ్డి, వేముల నాగరాజు, కీతవరపు సాయిలు కొంతకాలంగా గ్రామంలో గంజాయి తీసుకువచ్చి తాగుతున్నారు. ఈ నెల 21వ తేదీన ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు గ్రామానికి వెళ్లి అక్కడ ఒక వ్యక్తి నుంచి ఐదు కిలోల గంజాయిని కిలో రూ.2,500 చొప్పున కొనుగోలు చేసి దొండపాడుకి తీసుకు వచ్చారు. గ్రామంలోని బొడ్డు బసవయ్య కాలనీలో ఉన్న మదిర లక్ష్మారెడ్డి ఇంట్లోని ఖాళీ స్థలంలో భద్రపరిచారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో శనివారం ఆ ఇంటిపై దాడిచేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విషయం పసిగట్టిన కేతావత్ సాయి రెండు కిలోల గంజాయిని తీసుకుని బైక్‌పై పరారయ్యాడు. మిగిలిన నలుగురు భూక్య అశోక్, కొత్తపల్లి నాగార్జున, నంబూరి రత్నాకర్‌రెడ్డి, వేముల నాగరాజులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారినుంచి గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ నలుగురిని కోదాడ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు వివరించారు. డివిజన్ పరిధిలో అక్రమంగా గంజాయి తాగినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ సందీప్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ లింగరాజు, కానిస్టేబుల్ భాస్కర్, కవిరాజు, అమృతయ్య తదితరులను డీఎస్పీ అభినందించారు.

శివలీలారెడ్డికి ఐకాన్ అవార్డు

కనగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలారెడ్డికి సావిత్రీబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి ఐకాన్ అవార్డును హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు శనివారం అందజేశారు. శివలీలారెడ్డి చేస్తున్న సామాజిక సేవలను వారు కొనియాడారు. ఈ సందర్భంగా శివలీలారెడ్డి మాట్లాడుతూ ఐకాన్ అవార్డు అందుకోవటం సంతోషంగా ఉందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ****
నల్లగొండ
నకిరేకల్, మునుగోడు
8 www.andhrajyothy.com ● ఆదివారం 29 జూన్ 2025

ఆరు గ్యారెంటీల అమలు కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

శాలిగౌరారం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలుచేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పెరుమాండ్ల నరేష్ అన్నారు. మండలంలోని వల్లాల గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పదేళ్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి అప్పులరాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నా ధీమాతో కృషి చేస్తుందన్నారు.

సమాచారం

రాజీవ్ యువవికాసం పథకాన్ని అమలుచేయాలి

నార్కట్‌పల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకాన్ని అర్హులైన యువతకు అమలుచేసి రుణాలు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో శనివారం జరిగిన డీవైఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎన్నికల వాగ్దానాలు హామీలిచ్చి అధికారం చేపట్టాక హామీలను విస్మరించడం సమంజసం కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే ఉద్యోగాల కోసమని రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు. వెంటనే రాజీవ్ యువవికాస్ పథకాన్ని అమలు చేసి రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గద్దపాటి సుధాకర్, జిల్లా సహాయకార్యదర్శి వడ్డగాని మహేష్, ఆమనగంటి గోపినాథ్, దుబ్బాక అరుణ్, చింతల నగేష్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

కనగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామానికి చెందిన పగిడిమర్రి ఇద్దమ్మ (55) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మాజీ జడ్పీటీసీ చిట్ల వెంకన్నగౌడ్ ఇద్దమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతురాలి భర్త పెద్దబిక్షంను, ఆమె కుమారులైన సైదులు, రాంబాబులను ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కొంపెల్లి వెంకన్న, నాంపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీనివాస్‌యాదవ్



నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నల్లగొండటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ మాజీ సైనికుల విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లాకు చెందిన జక్కుల శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్‌యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన జక్కుల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తానని తెలిపారు. యాదవ మాజీ సైనికుల విభాగం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడు గోర్ల యశ్వంత్‌రాజ్‌యాదవ్, వినోద్ కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇక రెండు రోజులే!

- ఆస్తి పన్ను చెల్లింపుల గడువు
- గడువు దాటితే నూటికి రూ.2 చొప్పున అపరాధ రుసుము
- చెల్లింపులకు ఈ నెలాఖరుతో ముగియనున్న గడువు
- ఇంటింటికి డిమాండ్ నోటీసులు
- రూ.10వేలకు పైగా ఉన్న బకాయిదారులకు రెడ్ నోటీసులు ఇచ్చేందుకు సన్నాహాలు



రామగిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను రెండో అర్థ వార్షిక విడత చెల్లింపునకు మిగిలింది ఇక రెండు రోజులే. ఈ నెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుము ఉండదు. ఈ గడువు దాటిన తర్వాత ఆస్తి పన్ను చెల్లించే వారికి నూటికి రూ.2 వడ్డీ చొప్పున అపరాధ రుసుముతో చెల్లించాల్సిందే. మున్సిపాలిటీల్లో సంవత్సరంలో రెండు విడతలుగా ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంటుంది.మొదటి అర్థ వార్షిక ఏప్రిల్ నుంచి సెప్టెంబరు నెలలకు సంబంధించిన ఆస్తిపన్ను జూన్ మాసంలో చెల్లించాల్సి ఉంటుంది. రెండవ అర్ధ వార్షికం అక్టోబరు నుంచి మార్చి నెలలకు సంబంధించిన ఆస్తిపన్ను ఫిబ్రవరి మాసంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ప్రతీ ఏడాదికి రెండుసార్లు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. కానీ కొంతమంది సంవత్సరానికి ఒకేసారి చెల్లించాలన్న ఆలోచనలోనే ఉన్నారు. వాస్తవానికి ప్రతీ అర్ధవార్షికానికి సంబంధించిన చెల్లింపులు ఎప్పటికప్పుడు చేస్తే అపరాధ రుసుము పడదు. మొదటి అర్ధవార్షికానికి సంబంధించిన ఆస్తిపన్ను సకాలంలో చెల్లించకపోతే రెండో అర్థ వార్షికంలో రూ.2 చొప్పున వడ్డీ అపరాధ రుసుముతో బిల్ జనరేట్ అవుతుంది. అయితే ఈ రెండో అర్థ వార్షికానికి సంబంధించిన చెల్లింపు గడువు ఈ నెల 30వ తేదీలోగా ముగియనుంది. అక్టోబరు నుంచి మరుసటి ఏడాది మార్చి నాటికి సంబంధించిన ఆరు నెలల ఆస్తి పన్నును డిసెంబరు నెలాఖరులోగా చెల్లించాల్సి ఉంటుంది.

నల్లగొండలో 43వేల భవనాలు..

నీలగిరి మునిసిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో వాణిజ్య, నివాస భవనాలు కలిపి 43వేల వరకు ఉన్నాయి. సంవత్సరానికి ఆస్తి పన్ను డిమాండ్ రూ.18 కోట్లకు పైగానే ఉంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముందస్తు పన్ను రాయితీలో భాగంగా ఏప్రిల్‌లో ఒక్క నెలలోనే రూ. 7.60 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.10 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేస్తున్నప్పటికి ఇప్పుడు అంత సీరియస్‌గా జరగడం లేదు. ఆస్తి పన్ను చెల్లించాలని కోరుతూ ఇటీవల మునిసిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి డిమాండ్ నోటీసులు కూడా అందజేశారు. ముందస్తుగా చెల్లించిన వారు పోను 32వేల మందికి డిమాండ్ నోటీసులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 21 వేల మందికి డిమాండ్ నోటీసులు ఇంటి యాజమానులకు పంపిణీ చేశారు. మిగతా వాటిని వారం, పది రోజుల్లో పంపిణీ చేయనున్నారు. కాగా, భవన యజమానులు ఎక్కువ మంది మార్చిలో చెల్లించవచ్చనే ఆలోచనలో ఉంటున్నారు. గతంలో ఆన్‌లైన్ వ్యవస్థ లేని సమయంలో స్థానిక మునిసిపల్ సిబ్బంది పన్ను బకాయిపై అపరాధ రుసుం వేయకపోవడంతో ఇప్పుడు కూడా భవన యజమానులు అదే విధానం ఉందనే ఆలోచనలో ఉంటున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా తేడా రావడానికి వీలు లేదనే విషయాన్ని గ్రహించడం లేదు. ఈ నెల 30వ తేదీలోగా చెల్లించని వారికి జూలై నెలలో మూడు నెలలకు సంబంధించిన ఆస్తి పన్నుపై రూ.100కు రూ.2 చొప్పున వడ్డీ పడనుంది.

ఈ నెలాఖరులోగా చెల్లించాలి



పట్టణ ప్రజలకు తమ ఆస్తి పన్ను ఈ నెలఖారులోగా చెల్లించాలి. మొదటి ఆరు నెలల ఆస్తి పన్నును జూన్ 30లోగా చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుం ఉండదు. పట్టణ ప్రజలు దీనిని గమనించి గడువులోగా ఆస్తి పన్ను చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి.
- శివరాంరెడ్డి, మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్

'ఇందిరమ్మ'తో నిరుపేదల కల సాకారం

మర్రిగూడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో నిరుపేదల కల సహకారమవుతుందని దామెరబీమనపల్లి మాజీ ఎంపీటీసీ సిలువేరు విష్ణు అన్నారు. మండలంలోని దామెరబీమనపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకం ద్వారా నిరుపేదలకు మంజూరైనా ఇంటి నిర్మాణం కోసం ముగ్గులు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, యాదయ్య, రవి, రమేష్, నరసింహ, మల్లయ్య, నాగరాజు, గిరిధర్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్సీ

మునుగోడురూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలగలగూడెం గ్రామానికి చెందిన ఈదులకంటి అశోక్, కచలాపరం గ్రామానికి చెందిన నీరుడు సత్తయ్య మృతి చెందారు. శనివారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అశోక్, సత్తయ్య మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎలగలగూడెం సీపీఐ గ్రామశాఖ తరపున ఈదులకంటి అశోక్ కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయన్ని అందజేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం, తిర్పారి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నురిగి చలపతి, కైలాష్, సైదులు, ఉదయ్, శంకర్ పాల్గొన్నారు.

దామెరలో సమస్యల పరిష్కారానికి కృషి

- *విద్యుత్, పారిశుధ్య సమస్యలపై అధికారులు శ్రద్ధ వహించాలి*
- *ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి*

నాంపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెరలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దామెర గ్రామంలో అధికారులు పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ గ్రామస్తులను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కొద్ది రోజుల క్రితం మంజూరైన ఇందిరమ్మ లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇసుక కొరత ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి ఇసుక రీచులు దగ్గరలో తక్కువ ధరకు వచ్చే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. గ్రామంలో పారిశుధ్య లోపించడంతో పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, మురికిగుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని, లేనిచో సస్పెండ్ చేస్తానని ఆయన హెచ్చరించారు. ఇళ్ల మీది నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి గ్రామంలో త్వరలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామం నుంచి రాకపోకలకు గుంతలమయమైన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, గ్రామానికి కనీసం ఒక్క బస్సు కూడా లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవాసింగ్, ఎంపీడీవో రామకృష్ణశర్మ, మాజీ జడ్పీటీసీ ఏలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, దామెర మాజీ సర్పంచ్ దామెర యాదగిరి, నాయకులు పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, తల్లోజు నరసింహ చారి, కదారి పెద్దులు, పోలగోని శ్రీనివాస్, సయ్యద్ గఫార్, కొమ్ము బిక్షం, బిరుదోజు యాదమ్మ, అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల చెందిన అధికారులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ లబ్దిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నాంపల్లి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్, పోలగోని శ్రీకాంత్ కోరారు. దామెర గ్రామంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దేశంలో పెరుగుతున్న హింస, మతోన్మాదం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్

నార్కట్‌పల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మోదీ పరిపాలనలో దేశంలో మహిళలు, విద్యార్థులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలతో పాటు మతోన్మాదం, హింస రోజు రోజుకు పెరుగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో అవినీతి, ఉగ్రవాదం, నిరుద్యోగం నిర్మూలిస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచిందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను తగ్గిస్తోందని అన్నారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు రాజకీయాలకతీతంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ పెంజర్ల సైదులు, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, విజ్ఞాన అధ్యక్షుడు తాటి రమేష్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల, బొంతల చంద్రారెడ్డి, నాయకులు జిట్ట నగేష్, బొజ్జ చిన్న వెంకులు, ఎస్సార్ వెంకటేశ్వర్లు, శంకరయ్య, మహేష్, బయ్యన్న, వెంకటేశ్వర్లు, సరోజ, చెరుకు పెద్దులు, లూర్దు మారయ్య, మల్లయ్య, దండు రవి, కుమ్మరి శంకర్, మహేశ్వర్, సైదులు, నాగరాజు, ఐలయ్య పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

మునుగోడు: కేంద్రప్రభుత్వం కార్మికులు, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే జూలై 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఎం అనుబంధ సంఘాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండా శ్రీశైలం ప్రకటించారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు రాజకీయాలకతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమవేశంలో సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్‌కుమార్, యాసరాణి శ్రీను, లింగస్వామి, వీరమల్లు, యాట యాదయ్య, కాంతయ్య, కొంక రాజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి కవితకు లేదు

- *తెలంగాణ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్*

మర్రిగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని విమర్శించే నైతిక స్థాయి తెలంగాణ జాగృతి మహిళా అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు లేదని తెలంగాణ టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ఆజిలాపురం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కవిత చేసిన వ్యాఖ్యలు అసత్య ప్రచారానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. కవిత లిక్కర్ స్కాంలో తీహార్ జైలు వెళ్లిన ఆమె దేశంలోనే పరిపాలన ప్రతిభకు ప్రతీకగా నిలిచిన చంద్రబాబును విమర్శించడం అవివేకమని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే కవిత ఇలా ప్రవర్తిస్తుందని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంపై మాట్లాడుతూ గోదావరి వరద నీటిని సమర్థవంతంగా వినియోగించి రాయలసీమ పల్నాడు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు, అందించాలనే సంకల్పంతో పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టులను చేపట్టిన చంద్రబాబు నిర్ణయం దూరదృష్టిని ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. ఈ వ్యవహారంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలవడం కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు నివేదికలు అందజేసినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై, ఫోన్ టాపింగ్, డ్రగ్స్ స్కాంపై కవిత స్పందిస్తే ప్రజలు నిజంగా ఆదరిస్తారని అన్నారు. కవిత మొదట తన చర్యలపై ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిపై అలాంటి విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండీ షార్పుద్దీన్, అంజయ్య, రాంరెడ్డి, జంగయ్య, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముద్దం శ్రీనివాస్

వర్షాల కోసం బొడ్రాయికి జలాభిషేకం


చెర్వుగట్టులో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, స్థానికులు

నార్కట్‌పల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ఆరంభమైనా వర్షాభావ పరిస్థితులు రావడంతో శనివారం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామ మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో బొడ్రాయికి స్థానికులు జలాభిషేకం చేశారు. అనుకూల పరిస్థితులు రావాలని వర్షాలు సమృద్ధిగా రావాలని ఆకాంక్షిస్తూ గ్రామస్థులు బొడ్రాయికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేస్వామికి, గ్రామదేవతలకు పూజలను చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, నవీన్‌రెడ్డి, రమేష్, చార యాదయ్య, చీర మల్లేష్, దయ్యాల మల్లయ్య, మచ్చ లింగయ్య, మందుల లింగయ్య, కడగంచి శంకర్, మోటె సోమనారి, మోటె మహేస్, చీర శంకర్, శంకర్, నర్సింహ, చందు, మధు, వల్లూరు నర్సింహ, వెంకన్న, మహేష్, రమేష్, స్వామి, మచ్చ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కేతేపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ చైర్మన్ కుమారి మంజుల సూర్యావర్ సూచించారు. శనివారం కేతేపల్లి మండలంలోని రాయపురం సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. యువత క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించి తల్లిదండ్రుల ఆశలు నిజం చేయాలన్నారు. నేటి సమాజంలో యువత అందుబాటులో ఉన్న ఆకర్షణీయమైన వివిధ పదార్థాల ద్వారా మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. యుక్త వయసులో ఉండే పట్టుదల, శక్తిని మాదకద్రవ్యాలతో నిర్వీర్యం చేసుకుంటే భవిష్యత్తు అంధకారమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరిఫ్, కేతేపల్లి ఎస్ఐ సతీష్‌వర్మ, న్యాయవాదులు బి.ప్రకాశరావు, కొండ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సి, కళాశాల బోధనా సిబ్బంది, లీగల్ వలంటీర్లు, పోలీసు బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ చైర్మన్ మంజుల సూర్యావర్

గ్రామాల్లో లయన్స్ సేవలను విస్తృతం చేయాలి

- *లయన్స్ క్లబ్ రాష్ట్ర మల్టీపుల్ కోర్డినేటర్ అమరేందర్‌రెడ్డి*

శాలిగౌరారం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతం చేయాలని, ప్రతి లయన్ సభ్యుడు సమాజంలో మంచి గుర్తింపు పొందాలని లయన్స్ క్లబ్ రాష్ట్ర మల్టీపుల్ జీఎస్టీ కోర్డినేటర్ లయన్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలో శనివారం జరిగిన శాలిగౌరారం లయన్స్ క్లబ్ 4వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ మూడేళ్లలో పట్టణ ప్రాంతాలకు దీటుగా పల్లెలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి అన్ని వర్గాల ప్రజలకు ఎంతో చేరువకావడం అభినందనీయమన్నారు. క్లబ్ సభ్యులు సమష్టిగా కృషి చేస్తూ సేవా కార్యక్రమాలను చేపట్టడం హర్షించదగిన విషయమన్నారు. నేటి యువత, విద్యార్థులు చెడు మార్గంలో పయనించకుండా లయన్స్ క్లబ్ వారు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. లయన్స్ క్లబ్ జిల్లా పాస్ట్ గవర్నర్లు అమృతపల్లి కోటేశ్వర్‌రావు, డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో చేరిన ప్రతి సభ్యుడు సేవా దృక్పథాన్ని పెంచుకొని సమాజ సేవకు పాటుపడాలన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గుజలాల్ శేఖర్ బాబు-రమణ, ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, కోశాధికారి గుండు పరమేష్‌లతో గ్యాట్ టీమ్‌ను కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన కమిటీని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ జిల్లా గవర్నర్ కోడే సతీష్‌కుమార్, జిల్లా కార్యదర్శి శివశంకర్ సింహాద్రి, చిలుకూరి రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి గట్టుపల్లి అశోక్‌రెడ్డి, జీఎంటీ జిల్లా కోర్డినేటర్ గుడిపూరి వెంకటేశ్వరరావు, రీజన్ చైర్‌పర్సన్ కొండ సంతోష్, జోన్ చైర్‌పర్సన్ బుడిగె శ్రీనివాసులు, కొండపల్లి లక్ష్మారెడ్డి, నాయకులు కందాల పాపిరెడ్డి, దేవరశెట్టి పెద్ద శ్రీనివాస్, నెమరుగొమ్ముల రామ్మోహన్‌రావు, బాణాల రాంరెడ్డి, ఎర్ర శంభులింగారెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్, మారం వేణుగోపాల్‌రెడ్డి, మారడి చంద్రశేఖర్, గంట అంజిరెడ్డి పాల్గొన్నారు.




శాలిగౌరారం లయన్స్ క్లబ్ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న లయన్ అమరేందర్‌రెడ్డి

స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి


స్కాలర్‌షిప్ విద్యార్థులు అందుకున్న విద్యార్థులు

నల్లగొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులు విద్యలో రాణించడంతో పాటు సాల్కర్‌షిప్‌లను విద్య కోసం సద్వినియోగం చేసుకోవాలని వైఆర్‌పీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యేలిశాల రవిప్రసాద్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 30మంది విద్యార్థులకు రూ.8.15 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 250మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను, ఆర్థికసాయాన్ని అందజేసినట్లు తెలిపారు. వారిలో చాలా మంది డాక్టర్లు, ఇంజనీర్లు కావడంతో పాటు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్ఐలు, కానిస్టేబుళ్ల ప్రభుత్వ ఉద్యోగులుగా ఎదిగి సమాజానికి సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యేలిశాల హేమచంద్ర, యేలిశాల శరత్‌చంద్ర, యామా దయాకర్, ఆడెళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
***
నల్లగొండ
5
ఆదివారం 29 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	135
డ్రెస్	200
స్కిన్‌లెస్	230
గుడ్డు డజన్	78
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	35.0
కనిష్ఠం	24.0

అనుమానమే కాపాడింది
- హత్యచేసేందుకు వచ్చిన ఐదుగురు
- భూతగాదాలే కారణం
- నిందితులను పోలీసులకు పట్టించిన బాధితుడు

7



కాంగ్రెస్ పార్టీలో ప్రతిష్ఠాత్మకంగా భావించే డీసీసీ అధ్యక్ష పదవులకు గట్టిపోటీ కొనసాగుతోంది. రానున్న రోజుల్లో పార్టీ కేంద్రంగానే నిర్ణయాలు ఉంటాయని, ఎమ్మెల్యే అభ్యర్థులను సైతం డీసీసీల ద్వారానే ఎంపిక చేస్తామని పేర్కొనడంతో పాటు, పార్టీకి మొదటి నుంచి విధేయతగా ఉంటూ సేవలు అందిస్తున్న నాయకులకే పార్టీ పదవులిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

డీసీసీ అధ్యక్ష పదవులపై నజర్

- పోస్టు కోసం కీలక నాయకుల ప్రయత్నాలు
- నల్లగొండ డీసీసీకి గట్టిపోటీ
- పదవి కోసం మరోసారి గళం విప్పిన గుమ్ముల
- సూర్యాపేట, యాదాద్రి డీసీసీలపై పలువురి గురి
- మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా పైరవీ

దీంతో ఈ పదవులను దక్కించుకునేందుకు సీనియర్లు, కీలక నేతలు పోటీపడుతున్నారు. అధిష్ఠానం, గాడ్‌ఫాదర్ల మెప్పు పొందడం ద్వారా పదవులు దక్కించుకునే ప్రయత్నాలు వేగవంతం చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా ఆవిర్భవించిన నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు తీవ్రపోటీ ఉంది. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల డీసీసీ అధ్యక్ష పదవుల కోసం కీలక నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. కలిసొచ్చే సామాజిక సమీకరణాలు, పార్టీకి అందించిన సేవలను వివరిస్తున్న ఆశావహులు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మం త్రుల ద్వారావారి ప్రయత్నాలను ఉధృతం చేశారు.

నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవికి గట్టిపోటీ

కీలకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి కోసం పలువురు నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుమ్ముల మోహన్‌రెడ్డి, కొండేటి మల్లయ్యతో పాటు, పీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత ఈ పదవిని బలంగా ఆశిస్తున్నారు. శనివారం జరిగిన నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, పార్టీ పరిశీలకుడు నసిర్‌అహ్మద్ సమక్షంలోనే గుమ్ముల మోహన్‌రెడ్డి తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇప్పించాలని, తాను నల్లగొండ ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, నల్లగొండ జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశానని, డీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. పదవి ఇవ్వకపోయినా పార్టీ కార్యకర్తగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శిష్యుడిగా పార్టీకి సేవలందిస్తానని పేర్కొనడం చర్చకు దారితీసింది. కీలకమైన జిల్లా కావడం, బలమైన నాయకులు పదవి ఆశిస్తుండడంతో ఈ జిల్లా డీసీసీ బాధ్యతలు అధిష్ఠానం ఎవరికి

మిగతా 6వ పేజీలో...

సూర్యాపేట డీసీసీపై కీలక నేతల గురి

సూర్యాపేట డీసీసీ అధ్యక్ష పదవిని మరోసారి తనకే కేటాయించాలని ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఆయనతో పాటు ఈ పదవికి తుంగతుర్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, పీసీసీ డెలిగేట్ అన్నెపర్తి జ్ఞానసుందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందాచార్యులు, చింతమళ్ల రమేష్ పోటీపడుతున్నారు. వీరితో పాటు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు తదితర నాయకుల పేర్లు సైతం అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు క్యాడర్‌లో చర్చసాగుతోంది. చెవిటి వెంకన్నయాదవ్‌ను మరో పర్యాయం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిస్తారా? లేక కొత్తవారికి అవకాశం కల్పిస్తారా? అనే అంశం తేలాల్సి ఉంది.



ప్రభుత్వం రూ.2లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి ఏడు మాసాలైంది. అయితే తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో రుణాలు పొందిన రైతులకు మాత్రం వారి ఖాతాల్లో నేటికీ రుణమాఫీ నిధులు జమ కాలేదు. రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు (ఏపీజీవీబీ)లను ఈ ఏడాది జనవరి 1న తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో విలీనం చేశారు. దీంతో ఏపీజీవీబీలన్నీ టీజీబీలుగా మారాయి. ఈ క్రమంలో టీజీబీ ఇండియన్ ఫైనాన్సియల్ సిస్టమ్ కోడ్ (ఐఎఫ్ఎస్‌సీ) మారడంతో ఈ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ నిధులు ఖాతాల్లో జమకాకుండా నిలిచాయి.
- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

కోడ్ తెచ్చిన తంటా నిలిచిన రుణమాఫీ

- మారిన టీజీబీ ఐఎఫ్ఎస్‌సీ కోడ్
- ఏడు మాసాలు గడిచినా అందని డబ్బు

రాష్ట్రప్రభుత్వం తొలుతరూ.లక్ష, రెండో విడత రూ.1.50లక్షలు, మూడోవిడత రూ.2లక్షల లోపు రుణమాఫీ చేసింది.రేషన్ కార్డులు లేని వారికి, పేర్లు,ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబర్లు తప్పు పడిన వారికి రుణమాఫీ కాలేదు. వారు ఆందోళన వ్యక్తం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ ఏర్పాటు చేయగా, వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ కాని రైతుల వివరాలు తీసుకుని, వారితో కలిసి ఫొటోలు దిగి 2024 నవంబరులో యాప్‌లో అప్‌లోడ్ చేశారు. తప్పులు సవరించారు. ఈ తతంగం ముగిశాక 2024 నవంబరు 29న రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణమాఫీని విడుదల చేసింది.

ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడంతో..

తెలంగాణలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖలు 2025 జనవరి 1న తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో విలీనమయ్యాయి. దీంతో తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారింది. 2024 నవంబరు 29న రుణమాఫీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయకుండా, గత జనవరిలో విడుదల చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అప్పటికే టీజీబీ బ్రాంచ్‌ల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారిపోవడంతో ఆ బ్యాంకుల్లోని రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదు. కోడ్ మారిన కారణంగా రైతుల ఖాతాల్లో జమ కాని రుణమాఫీ నిధులు ప్రభుత్వానికి వాపసు వెళ్లాయి. ఇది రాష్ట్రవ్యాప్త సమస్య అయినందున రైతుల ఖాతాల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మార్చి వారి ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమచేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో రుణ

మిగతా 6వ పేజీలో...

డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు

టీజీబీల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారిన కారణంగా రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన డైరెక్టర్‌తో మాట్లాడారు. టీజీ బీ రైతుల ఖాతాల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సవరించి, రుణమాఫీ నిధులు జమ చేయాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం త్వరలోనే నిధులు విడుదల చేసే అవకాశం ఉంది.
- గోపాల్,జిల్లా వ్యవసాయశాధికారి,యాదాద్రి

బ్యాంక్ చుట్టు తిరుగుతున్న



ఆగామోత్కూర్ ఏపీజీవీబీ బ్యాంక్‌లో రూ.60వేలు పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పడంతో బ్యాంక్‌కు వెళ్లి చూడగా నగదు జమకాలేదని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి.
- కడారి వెంకన్న, కల్వలపాలెం, మాడ్గులపల్లి

వడ్డీ వ్యాపారులతో జాగ్రత్తగా ఉండాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులను, అమాయకులను లక్ష్యంగా చేసుకొని కొందరు షేర్ మార్కెట్, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులంటూ, అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి డబ్బు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఎవరైనా మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంత మంది వారి మాయలోపడి భూములు, బంగారం తాకట్టుపెట్టి డబ్బులు తీసుకొచ్చి మరీ ఆశకుపోయి పెట్టుబడులుపెట్టి మోసానికి గురవుతున్నారన్నారు. అలాగే ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. వడ్డీ వ్యాపారులు భూములను సేల్‌డీడ్లు చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.సైబర్ నేరాలపై ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు.

గ్రామాల్లో డ్రైనేజీలు పటిష్ఠంగా ఉండాలి

జడ్పీ సీఈవో శ్రీనివా‌స్‌రావు



తిప్పలమ్మగూడెంలో ఇంకుడుగుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

తిప్పర్తి,జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠంగా ఉండాలని జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం తిప్పర్తి మండల పరిధిలోని తిప్పలమ్మగూడెం, సర్వారం గ్రామాల్లో కమ్యూనిటీ డ్రైనేజీలను నిర్మించడానికి తగిన స్థలాలను ఆయన పరిశీలించారు.గ్రామాలకు శివారులో పంటపొలాలు ఉండడంతో డ్రైనేజీ నీరంతా ఒకే స్థలంలో చేరేలా ఇంకుడు గుంత నిర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

బదిలీపై జిల్లాకు ఇద్దరు డీఎస్పీలు

నల్లగొండ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా జిల్లాకు కొత్తగా ఇద్దరు డీఎస్పీలు నియమితులయ్యారు. ఎస్‌బీ డీఎస్పీగా ఇప్పటి వరకు వెయిటింగ్‌లో ఉన్నా భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీగా వెయిటింగ్ లిస్టులో ఉన్న జి.రవిని నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఈ రెండు పోస్టులు కొంతకాలంగా ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు.

భవిత పనులను త్వరగా పూర్తిచేయాలి

డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు



మండల కేంద్రంలో భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

మాడ్గులపల్లి,జూన్28 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను త్వరగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో నిర్మితమవుతున్న భవిత కేంద్రం పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు భవిత కేంద్రంలో ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలందించడం అభినందనీయం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



వైద్యులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరంగా ఎన్నో ఒత్తిళ్లు ఉన్నా వైద్య వృత్తిలో ఉంటూ పేద ప్రజలకు సేవలందించడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవల అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించిన డాక్టర్ల బృందాన్ని కలెక్టర్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు దీటుగా జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యుల బృందం మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతం చేసిందని, 60 ఏళ్ల వయసు ఉన్న మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించి ఆరు కిలోల కణతిని తొలగించారని అభినందించారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రులను పటిష్ఠం చేస్తోందన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్ సహాయ డైరెక్టర్ నగేష్ మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ ఫ్యాకల్టీతో పాటు, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. అనంతరం వైద్యులు శ్రీకాంత్, నిఖిత, దివ్య, బద్రి నారాయణ, పరమేశ్వరి, సుధ, గిరినిశాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. అంతకుముందు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో నిర్వహించిన మానెటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు, అకాడమిక్ సౌకర్యాలు, భవనాలు, లెక్చర్ హాల్స్, లైబ్రరీ, విద్యార్థుల హాస్టల్ తదితర విషయాలపై సమీక్షించారు. అనంతరం నూతనంగా నిర్మించిన మ్యూజియం, ఇండోర్ గేమ్స్ హాల్, డిసెక్షన్ హాల్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఆ తర్వాత మెడికల్ కళాశాల పక్కనే ఉన్న స్థలంలో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విసీల రాణి, రామచంద్ర, అజీజ్, వందన, స్వరూప రాణి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్సీ శంకర్ నాయక్
- కాంగ్రెస్‌లో ఒక్కరికి ఒకే పదవి : టీపీసీసీ పరిశీలకుడు నసీర్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఒక్కరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలను దండుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల మాటలు ఎవ్వరూ నమ్మడం లేదని, ప్రజల విశ్వాసం కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ మతతత్వం పేరుతో రాజకీయం చేస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ పరిశీలకుడు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు లభిస్తాయన్నారు. బ్లాక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం కోసం దరఖాస్తులు తీసుకొని సామాజికన్యాయం పాటించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో మండలం నుంచి మూడు దరఖాస్తులు తీసుకొని స్థానిక నాయకుల సమన్వయంతో ఎంపిక చేస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, మంత్రి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ, నియోజకవర్గ నుంచి ఇప్పటివరకు ఎవ్వరికీ రాష్ట్రస్థాయి పదవులు రాలేదని, గుమ్ముల మోహన్‌రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు లేదా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలన్నారు. ఈ మేరకు తీర్మానం చేయగా, సమావేశానికి వచ్చిన పార్టీ శ్రేణులంతా మద్దతు ప్రకటించారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, గడ్డం అనుపరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, బషీర్ అహ్మద్, సంకు ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ల సమావేశాన్ని విజయవంతం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లేష్



సమావేశంలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి జూలై 1న నిర్వహించనున్న అన్ని కార్మిక యూనియన్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలం, పట్టణం, వేములపల్లి, మాడ్గులపల్లి మండలాలకు సంబంధించి అన్ని రంగాల్లో పనిచేస్తున్న యూనియన్ల సభ్యులతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మల్లుగౌతంరెడ్డి, హమాలీల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు ముత్యాల లక్ష్మీనారాయణ, మాలి చిన్నరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో యాదాద్రి సేవలు

- అందుబాటులో ఆర్జిత, దర్శన సేవలు
- అద్దె గదులు,శాశ్వత పూజలు, విరాళాలకు సైతం ఆన్‌లైన్‌లో అవకాశం

6

రైతులకు అవగాహన కల్పించేందుకే ‘సాగు న్యాయ యాత్ర’

- అక్టోబరు 2 వరకు 800 గ్రామాల్లో 2,400 కిలోమీటర్ల యాత్ర
- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

క్రాఫ్ట్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ

మిర్యాలగూడ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): క్రాఫ్ట్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు సందీప క్రియేషన్స్ ఫౌండర్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత చెలమళ్ల సందీపారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలికలు, మహిళలకు ఫ్లవర్ మేకింగ్, అరేంజ్‌మెంట్స్ విభాగాల్లో ఉచిత ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 7729914469 నెంబరుకు కాల్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు సీపీఐ మండల మహాసభ

డిండి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల 15వ మహాసభను మండల కేంద్రంలోని ఈజెగార్డెన్స్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల మహాసభకు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

తైక్వాండో విజేతలకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల అభినందన



తైక్వాండోలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

దామరచర్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలిలోని బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఈనెల 25 నుంచి 27వరకు నిర్వహించిన 8వ ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో దామరచర్ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు శనివారం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని వేర్వేరుగా కలిశారు.వారు విద్యార్థులను అబినందించారు. ఈ పోటీల్లో అన్నెం అఖిల్‌రెడ్డి, తాటి సాయివెంకట్, గోలి దేవేంద్రనాథ్ బంగారు పతకాలు సాధించగా కేశగోని దేవకినందన్ రజతం, దారగాని సాయిఈశ్వర్, కేశగోని జ్ఞానదీప్, ఎర్రం విరించిత్ నందన్ రెడ్డి, అలంపల్లి భువనేశ్వర్, అనిల్‌కుమార్‌జోషి కాంస్య పతకాలు సాధించినట్లు ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకుడు రమేష్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు నిరు పేదలకు వరం

మాడ్గులపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు నిరు పేదలకు వరం మని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతకాయల సతీష్ అన్నారు. మండలంలోని కల్వలపాలెం గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేసాని ప్రభాకర్‌రావు, రంగారావు, చిట్యాల ఎల్లయ్య, చిత్రం సతీష్, విజయ్‌కుమార్, బొడ్డుపల్లి సతీష్ ఉన్నారు.

వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలి : బీజేపీ

మిర్యాలగూడ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ అధ్యక్షుడు బంటు గిరి మా ట్లాడుతూ ఈదులగూడ, భరత్‌నగర్, గొల్లగూడ తదితర శివారు కాలనీల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, రహదారులకిరువైపులా చెట్లు ఏపుగా పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. హౌసింగ్‌బోర్డులో రహదారులు గుంతలమయంగా మారడంతో వర్షపు నీరు నిలిచి అసౌకర్యం కలుగుతుందన్నారు. అలాగే చెత్తకుప్పలు దర్శనమిస్తుండగా, యూజీడీ పనుల కోసం తీసిన గుంతలు ప్రమాదకరంగా మా రాయన్నారు. పట్టణంలో పర్యటించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మూల రాజిరెడ్డి, వెంకటరమణ, గిరి పాల్గొన్నారు.

ఫీజుల వివరాలు బోర్డుపై ప్రదర్శించాలి : ఎంఈవో

మిర్యాలగూడ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రై వేటు పాఠశాలల యాజమాన్యం ఫీజుల వివరాలు బోర్డుపై ప్రదర్శించాలని ఎంఈవో లావూరి బాలు ఆదేశించారు. పట్టణంలోని పలు పాఠశాలలను తని ఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేయరాదని, పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయించొద్దన్నారు. విద్యార్థుల సం ఖ్యతో పాటు ఆయా పాఠశాలల్లోని బస్సుల వివరాలను ప్రదర్శించాలన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయాలన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

తిరుమలగిరి(సాగర్), జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎంఈవో శ్రీనివాస్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కన్వీనర్ పెరిక సురేష్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు కేటాయించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాష్, సాయి మహారాజ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అత్తపై కోడలు దాడి : చికిత్స పొందుతూ మృతి

వేములపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల నేపథ్యంలో కోడలు అత్తపై కర్రతో దాడి చేయడంతో గాయాలపాలై చికిత్స పొందుతూ అత్త మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని సల్కునూరు గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుర్రం అంజమ్మ(72)ను ఈనెల 25న పెద్ద కోడలైన పార్వతమ్మతో ఇంటి విషయమై ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో పార్వతమ్మ అత్త అంజమ్మపై కర్రతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నల్లగొండ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు.. మృతురాలి చిన్న కుమార్తె సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న వేములపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్

నిడమనూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని రైతులకు విశిష్ట సంఖ్యను కేటాయించి ఓ గుర్తింపు కార్డును ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గుర్తింపు కార్డు జారీ ప్రక్రియ మండలంలో కొనసాగుతోంది. భవిష్యత్‌లో ఈ గుర్తింపు కార్డు ద్వారానే రైతుల కోసం అమలు చేసే పథకాలు వర్తించేలా చూడనుంది. విశిష్ట గుర్తింపు కార్డులో కూడా 11 అంకెల నంబర్లను కేటాయించనున్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతుకు సూచిస్తుంది. రైతులు తమ దగ్గర్లోని వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వ్యవసాయ రంగాన్ని డిజిటల్ చేసే కార్యక్రమంలో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది.



నిడమనూరులో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ అధికారి (ఫైల్)

కేంద్ర పథకాలకు నంబర్ తప్పని సరి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా తదితర పథకాలు రైతులకు వర్తించాలంటే ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకొని ఉండాలి. భవిష్యత్తులో ఎరువుల పంపిణీ కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే ఉంటుందని తెలుస్తోంది. కొత్తగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు రైతుల ఖాతాలో జమ కావాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పథకాలకే ఫార్మర్ రిజిస్ట్రేషన్ అం టున్నప్పటికీ భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందాలన్నా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉం డేలా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. నిడమనూరు మండలంలో 18,797 మంది రైతులు ఉండగా 2,349 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానంతో రైతులకు 11 అంకెల నంబర్లు గల ఓ యూనిక్ ఐడీ కార్డు వస్తుంది. దీంతో రైతుల భూముల వివరాలతో పాటు నేల స్వభావం, సర్వే నంబర్లు, సాగు చేస్తున్న పంటల వివరాలు, తదితర రైతుకు సంబంధించిన సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆధార్‌కార్డుకు అనుసంధానం చేస్తుండడంతో ఒక క్లిక్‌తో రైతుల వివరాలు అందుబాటులోకి వస్తాయి. అంతేగాకుండా ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాల్లో సైతం రైతు ల వివరాలు ఎంటర్ చేయగానే పంటలకు సం బంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో తెలుస్తాయి. ఈ కార్డు ఉన్నవారికే ప్రభుత్వం పథకాలు అందేలా చేస్తుంది.

ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు ఈ ఫార్మర్ యూనిక్ ఐడీ కార్డు తప్పనిసరి చేసింది. రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్‌ను తీసుకువస్తే రిజిస్ట్రేషన్ చేస్తాం.

\- దండెం విజయచంద్ర, ఏఈవో, నిడమనూరు.

రిజిస్ట్రేషన్ ఇలా ..

రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత ఏఈవో లేదా ఏవోకు వివరాలు సమర్పించాలి. ఇందుకోసం రైతులు తమ ఆధార్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డు లింక్ అయిన మొబైల్ ఫోన్‌ను కూడా తీసుకెళ్లాలి. రైతుల వివరాలు నమోదు చేసేటప్పుడు ఫోన్‌కు మూడుసార్లు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని ఎంటర్ చేయగానే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. 11 అంకెల నంబర్లతో కూడిన యూనిక్ ఐడీ కార్డు వస్తుంది.

కార్మికుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా,జూన్28(ఆంధ్రజ్యోతి) కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో విశ్వబ్రాహ్మణులకు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 మంది విశ్వబ్రాహ్మణ కార్మికులకు జానారెడ్డి కుటుంబం సొంత ఖర్చులతో ఇన్సూరెన్స్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇదేవిధంగా కార్మికుల సంక్షేమానికి చేయూత నివ్వనున్నట్లు, ఇప్పటికే నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ వివిధ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హాలియా ఎస్ఐ సాయిప్రశాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కార్పెంటర్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు కాతోజు ఎల్లయ్యచారి, గౌరవాధ్యక్షుడు సనగంటి సాగారాచారి, కోశాధికారి నాగార్జున బ్రహ్మచారి, గౌరవ సలహాదారుడు ఓరువాల లక్ష్మణాచారి, సనగంటి గోవిందాచారి, సనగంటి యుగేంద్రచారి, సొనగంటి లక్ష్మాణాచారి, నాగార్జున కృష్ణచారి, బొడ్డుపల్లి వెంకటాచారి, బొడ్డుపల్లి కృష్ణచారి, మునగాల రవీంద్రచారి, బొడ్డుపల్లి లక్ష్మీపతిచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ శనివారం కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య వ్యవస్థ ప్రధానమైనదని, దా నిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. జవాన్లతో వార్డు ఆఫీసర్లు మమేకమవ్వాలన్నారు. పౌరసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయరాదని, సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. పట్టణంలో అమలవుతున్న 100 యాక్షన్ ప్లాన్‌లో మొక్కలు నాటాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి జ్ఞానేశ్వరి, మునిసిపల్ ఇంజినీర్ వెంకన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐలు, పీసీ బదిలీ

నిడమనూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏఎస్ఐలు, ఓ కానిస్టేబుల్ బదిలీ అయ్యారు. ఏఎస్ఐ చిలుకూరి రమేష్ ఎస్ఐగా పదోన్నతి పొంది రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ కాగా మరో ఏఎస్ఐ కోడిరెక్క జోజి నిడమనూరు స్టేషన్ నుంచి వాడపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీఅయ్యారు. అలాగే వంగూరి రమేష్ కానిస్టేబుల్ కూడా ఇక్కడ నుంచి బదిలీ అయ్యారు. మూడేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వహిస్తుండటంతో సాధారణ బదిలీల్లో భాగంగా వీరిని బదిలీ చేశారు.

ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

మిర్యాలగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. రైతు భరోసా 15 వేలు, ఆటో కార్మికులకు 12 వేలు, మహిళలకు రూ. 2,500, తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం నెలకు రూ. 25వేలు ఇవ్వాలని అన్నారు. ధరలను నియంత్రించాలని అన్నారు. విద్యా, వైద్యాన్ని ప్రవేటు రంగంనుంచి తొలగించి ప్రభుత్వ పరిదిలోకి తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, సహాయకార్యదర్శి పోతుగంటి కాశీ, మండల కార్యదర్శి మోహన్‌నాయక్, రమేష్, జ్యోతి, శ్రీను, సురేష్, ఇమ్మాన్యుయేల్, జానకిరాములు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో పూడికతీత పనులు ప్రారంభం



స్వర్ణముఖి కాల్వలో పూడికతీత పనులను చేపట్టిన మునిసిపల్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవరకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని స్వర్ణముఖి కాల్వతోపాటు పలు డ్రైనేజీ కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, పూడికతీత పనులను మునిసిపల్ సిబ్బంది శనివారం ప్రారంభించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 26న 'పారిశుధ్యం అస్తవ్యస్తం' శీర్షికన కథనం ప్రచురి తమైంది. దీంతో మునిసిపల్ అధికారులు స్పందించారు. స్వర్ణముఖి కాలువతోపాటు పలు డ్రైనేజీ కాలువలలో పేరుకుపోయిన చెత్తను, పూడికతీసే పనులు చేపట్టారు. కాల్వలను శుభ్రం చేసి నీరు నిలువ ఉం డకుండా చర్యలు చేపడుతున్నారు. దోమలబెడద నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ పేర్కొన్నారు.

అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలని వాసవీ క్లబ్ సీనియర్ సభ్యుడు, నేత్రనిధి ప్రతినిధి మిట్టపల్లి విజయభాస్కర్ అన్నారు. ఇటీవల మరణించిన పట్టణ ప్రముఖుడు రంగా లింగయ్య నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయగా వారిని శనివారం అభినందించి, నేత్రనిధి సర్టిఫికెట్ అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అవయవ, నేత్రదానం వెలకట్టలేనిదన్నారు. ఒకరి అవయవదానంతో ఏడుగురికి ప్రాణం పోయొచ్చని, నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు ఇవ్వొచ్చన్నారు. ార్యక్రమంలో రంగా హరినాథ్, సామ శ్రీనివాస్, పాంపాటి రామలింగయ్య, సోమ వెంకటేశ్వర్లు, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు యూత్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌నారాయణ



వెంకట్‌నారాయణ

నిడమనూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు యువత జిల్లా అధ్యక్షుడిగా నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన సంకూరి వెంకట్‌నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని ధ్రువీకరిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌నారాయణ మాట్లాడుతూ జిల్లాలో మున్నూరుకాపు యువతను మరింత బలోపేతం చేస్తానని అన్నారు.

మహిళలు అక్షరాస్యత సాధించాలి : ఎంపీడీవో

డిండి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు అక్షరాస్యత సాధించాలని ఎంపీడీవో వెంకన్న తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలతో నిర్వహించిన ఉల్లాస్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళ సంఘాల్లో ఉన్న నిరాక్షరాస్యులైన వయోజన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉల్లాస్ పథకాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు. ఈ పథకాన్ని విద్యాశాఖ, సెర్ప్ ఉమ్మడి భాగస్వామ్యంతో కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోప్యానాయక్, ప్రధానోపాధ్యాయులు, బీవోఏలు పాల్గొన్నారు.

మాల్‌లో తాగునీటి కోసం తప్పని తిప్పలు

చింతపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)లో మిషన్ భగీరథ జలాలు రెండు రోజుల నుంచి సరఫరా కావడం లేదు. దీంతో పాటు బోరు, బావుల నుంచి నీటి సరఫరా లేకపోవడంతో కాలనీవాసులు ట్యాంకర్ ద్వారా నీటిని రూ.500 800 ఖ ర్చు చేసి కొనుగోలు చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మిర్యాలగూడలో రైల్వే హమాలీలకు సమ్మె కరపత్రాలను పంచుతున్న రవినాయక్

మిర్యాలగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ కోరా రు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో రైల్వే హమాలీ వర్కర్లకు సమ్మె కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సమ్మె లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి ఉత్పత్తి, రవాణా రంగాన్ని స్తంభింపచేసి ప్రభుత్వానికి తీవ్ర నిరసన తెలియజేయాలని కోరారు. సార్వత్రిక సమ్మె విజయవంతానికి జూలై 1న స్థా నిక మార్కండేయ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి అన్నిరంగాల కా ర్మికుల యూనియన్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా నాయకులు అయూబ్, రైల్వే హమాలీ వర్కర్స్ నాయకులు బద్యానాయక్, రెడ్యానాయక్, రవి, కిషన్, వెంకన్న, రాజేష్, కిషోర్ పాల్గొన్నారు.

● హాలియా : దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని జయప్ర దం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు పిలుపునిచ్చారు. హాలియాలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ బంద్, సమ్మెను పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జటావత్ రవినాయక్, కమిటీ సభ్యులు వెంకన్న, జిల్లా నాయకులు మెగావత్ రాములు, జాను తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో కొత్త సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ లైన్ మరమ్మతు పనులు చేస్తున్నందున ఇండస్ట్రీయల్-2 పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మిర్యాలగూడ రూరల్ విద్యుత్ ఏఈ బి.అమర్‌సింగ్ శనివారం తెలిపారు. విద్యుత్ అంతరాయానికి గృహ, వాణిజ్య, వ్యవసాయ, పరిశ్రమల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలి



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

పెద్దవూర, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపా ధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలని ఉపాధి హామీ ఏపీడీ నవీన్‌కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి చకిలం వేణుగోపాల్ అన్నారు. మండలంలో ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి30, 2025 వరకు రూ.9.57 కోట్లతో చేపట్టిన పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ చేపట్టారు. కూలీలకు సంబంధించిన పనులు, సీసీ రోడ్ల పనులు ఉన్నాయి. 26 గ్రామపంచాయతీల్లో చేసిన పనుల కొలతలపై 12రోజులపాటు తనిఖీలు నిర్వహించి కూలీలకు రూ.6.95 కోట్లు, మెటీరియల్‌కు రూ. 2,32,92,000 చెల్లించినట్లు చెప్పారు. ఎంపీడీవో ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ చెన్నకేశవులు, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఫసియొద్దిన్, ఇన్‌చార్జి ఏపీవో గోపాల్‌రెడ్డి, మండల ఈజీఎస్ ఇంజనీర్ కొండల్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.